

దగ్గరుండి మంత్రి అంబటి రిగ్గింగ్

ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం పోలింగ్ బూత్‌లలో మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయించారు. అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులు, కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ మూకలు రాళ్ల వర్షం కురిపించాయి. బూత్‌లోని వైసీపీ వారిని బయటకు తీసుకురావాలని రూరల్ సీఐ రాంబాబును కోరినా పట్టించుకోకపోవడంతో కన్నా అనుచరులు బూత్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. దీంతో అంబటి అనుచరులు రాళ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడిచేశారు. దీంతో ఓ బాలుడితో పాటు ఐదుగురు గాయపడగా బాధితులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇరువర్గాల దాడి.. సీఐకి గాయాలు

తాడికొండ మండలం నిడుముక్కలలో 83వ నెంబరు బూత్‌లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత టీడీపీ వార్డు నెంబరు నాగ స్వరూపపై దాడి చేసి ఆమె జాకెట్ చించి, తాళిబొట్టును తెంపుకుని ఇంట్లోని వస్తువులను కూడా ధ్వంసం చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకోగా ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. రాళ్ల దాడిలో సీఐ ప్రభాకర్‌కి గాయాలైయ్యాయి. పోలీస్ బెటాలియన్ వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గుంటూరు అమరావతి రోడ్డుపై ఇరు వర్గాలు భైఠాయించి ఆందోళనకు దిగారు.





పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు

చెలరేగిన వైసీపీ శ్రేణులు

- టీడీపీ నేతలే లక్ష్యంగా దాడులు

పోలింగ్ సరళితో బెంబేలెత్తిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు అసహనంతో చెలరేగిపోయారు. పల్నాడు సహా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోయారు. పల్నాడు జిల్లాలో అయితే ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. గుంటూరు నగర పరిధిలోని పలు బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలు చేశాయి. అసహనం, ఆందోళనతోనే పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు దిగినట్లు తెలుస్తోంది.



- దగ్ధమవుతున్న బహ్మారెడ్డి వాహనం



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం



పూర్తిగా దహనమైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కారు



- అరవిందబాబు వాహనాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు

ఓటెత్తారు..

- కేంద్రాల వద్ద జాతరను తలపించిన జనం
- ఉదయం నుంచి బూత్‌ల వద్ద ఓటర్ల బారులు
- ఈవీఎంల మొరాయింపు, ఆలస్యంగా ప్రారంభం
- పలు దగ్గర్ల కనీస సదుపాయాలు లేక అల్లాడిన జనం
- మధ్యాహ్నం వరకు మండిన ఎండ.. పలువురు ఇబ్బంది
- సాయంత్రానికి చల్లగా మారిన వాతావరణం, పలుచోట్ల వర్షం



మంగళగిరిలోని పోలింగ్ కేంద్రంలో రాత్రి 10 గంటలకు బారులు తీరిన ఓటర్లు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు పోటెత్తారు.. మధ్యాహ్నం వరకు ఎండ మండింది.. ఓటమి భయంతో పోలింగ్ రోజూ వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగే పోలింగ్ బూత్‌ల వద్దా ఈ సారి వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా.. బూత్‌ల వద్ద ఓటింగ్‌లో జాప్యం జరిగినా.. భానుడు భగభగ మండినా.. ఓటర్లు వెనుతిరగలేదు. ఓటేసి కాని వెళ్లేది లేదన్నట్లుగా భీష్మించుకున్నారు. ఓటరు చైతన్యం వెల్లివెరిసిందా.. అన్నట్లుగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మరోవైపు ప్రచారాలపై నిషేధం ఉన్నా వైసీపీ అభ్యర్థులు పలు దగ్గర్ల పట్టించుకోకుండా తమకు ఓటేయ్యాలంటూ, బూత్‌ల వద్ద టీడీపీ శ్రేణులు అల్లర్లు చేస్తున్నాయంటూ.. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌తో పోలింగ్ రోజంతా హోరెత్తించారు. ఇతర రాష్ట్రాలే కాదు.. విదేశాల నుంచి వచ్చిన ఓటర్లు కూడా గంటల తరబడి నిరీక్షించి మరీ ఓటేశారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభ సమయం కాగా అంతకంటే ముందే వచ్చి ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరారు. యువత, మహిళలు క్యూల్లో బారులు తీరారు. గేట్లు బయటే గుంపులు, గుంపులుగా ఉదయం ఆరు గంటల నుంచే పడిగాపులు కాశారు. భగభగమండే సూర్యుడు మధ్యాహ్నానికి శాంతించి చల్లబడడంతో ఓటర్లు సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నా చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా పలు కేంద్రాల్లో పోలింగ్ జరుగుతూనే ఉంది.

వెల్లివెరిసిన చైతన్యం.. విదేశాల నుంచి రాక

ఓటేయడానికి బారులు తీరినవారిలో యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఓటేయడానికి విదేశాల నుంచి కూడాపెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కువైట్, ఐర్లాండ్, న్యూజిలాండ్, అమెరికా తదితర దేశాల నుంచి కూడా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గడచిన రెండు వారాలుగా భగభగమండుతున్న సూర్యుడు ఓటర్ల ఉత్సాహాన్ని చూసి సోమవారం తన ప్రచండాన్ని అంతగా చూపలేదు. పైగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పలు నియోజకవర్గాల్లో వర్షం కురిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల, వేమూరు పరిధిలో వాతావరణం చల్లబడింది. దీంతో సాయంత్రం వేళ ఓటర్లు మరింత ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లకు బూత్‌ల వద్ద సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చాలాదగ్గర్ల ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

స్ట్రాంగ్‌రూంల్లో ఓటరు తీర్పు భద్రం

ఓటరు తీర్పు ఆదివారం రాత్రి నుంచి స్ట్రాంగ్‌రూంలకు చేరుకుంటున్నది. పోలింగ్ ముగిసిన కేంద్రాల నుంచి ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్లకు తీసుకొచ్చారు. పోలింగ్ ఆలస్యమైన ప్రదేశాల నుంచి ఈవీఎంలు అర్ధరాత్రి తర్వాత వచ్చాయి. గుంటూరు లోక్‌సభకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్ల, నరసరావుపేట కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు రిసెప్షన్ సెంటర్లలో ఉండి ఈవీఎంలు భద్రంగా స్ట్రాంగ్ రూంల్లోకి వెళ్లేంత వరకు మొత్తం ప్రక్రియని పర్యవేక్షిస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల సామాగ్రి చేరు కున్న తర్వాత రాజకీయ పార్టీల ఏ జెంట్ల సమక్షంలో సీళ్ల వేస్తారు.

గుంటూరు జిల్లాలో.. 75.74 శాతం

గుంటూరు జిల్లాలో చెదురు ముదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 75.74 శాతం పోలింగ్ నమోదైనట్లు సోమవారం అర్ధరాత్రి అధికారులు ప్రకటించారు. కొన్ని నియోజక వర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో ఆరు గంటల తర్వాత కూడా క్యూల్లో ఓటర్లు ఉండటంతో వారికి స్లిప్పులు ఇచ్చి ఓటు వేసేందుకు పీవో లు అనుమతించారు. రాత్రి వరకు పోలింగ్ జరిగే అవ కాశం ఉన్నందున పోలింగ్ శాతం మరిగే పెరిగే అవకాశం ఉంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి విడదల రజని ఎన్నికల కోడ్‌ని పూర్తిగా ఉల్లంఘించి సోమవారం ఉదయం నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రచారం చేశారు. అలానే టీడీపీ వాళ్లు దొంగ ఓట్లు వేస్తున్నారని ఐవీఆర్ఎస్ కాల్స్‌లోనే దుష్ప్రచారం చేయించారు. కాగా తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఐతానగర్ పో లింగ్ బూత్‌లో గొట్టిముక్కల సుధాకర్ అనే ఓటరుపై చేయి చేసుకున్నారు. లైన్ లో రాకుండా అక్రమంగా బూత్‌లోకి ఎలా ప్రవేశిస్తారని సుధాకర్ ప్రశ్నించినం దుకు ఎమ్మెల్యే చెంపపై కొట్టారు. దాంతో ఓటరు కూడా ఎదురు తిరిగి ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించారు. ఇదే అదనపుగా ఎమ్మెల్యే అనుచరులు రెచ్చిపోయి ఓటరుపై పిడిగుద్దులతో దాడి చేశారు. ఈ విషయం ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో ఎమ్మెల్యే శివకుమార్‌ని తక్షణమే అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్టు చేయా లని ఆదేశించింది. గుంటూరు తూర్పు నియోజ కవర్గంలో అంజుమన్ ఇస్లామియా పాఠశాలలోని పోలింగ్ బూత్, చలమయ్య డిగ్రీ కాలేజ్‌లోని బూత్‌ని వైసీపీ నేతలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా టీడీపీ నాయకులు ప్రతిఘటించారు. చలమయ్య డిగ్రీ కళాశాల బూత్‌లో ఇరువర్గాలు దాడులు చేసుకోగా ఇద్దరు గాయపడ్డారు. మంత్రి రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి కొరిటెపాడు పరిసర ప్రాం తాల్లో పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ మండల పార్టీ నాయకుడు గింజుపల్లి శివప్రసాద్‌పై వైసీపీ నేతలు దాడి చేశారు. కోయవారి పాలెంలో ఇరు వర్గాల మధ్య తోపులాటలు జరిగాయి. పెదకొండూరులో పలు దగ్గర్ల ఘర్షణలు జరిగాయి. పొన్నూరు నియోజకవర్గం చింతలపూడిలోని 249వ నెంబరు పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి అంబటి మురళీ కృష్ణ తిష్ట వేశారు. విషయం తెలుసుకుని టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సతీమణి జ్యోతిర్మయి, ఆమె కుమార్తె వచ్చి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో పోలీసులు అంబటిని అక్కడి నుంచి పంపించేశారు. నందూరులో టీడీపీ ఏజెంట్‌పై దాడి చేయ గా ఇరువర్గాలు తోపులాటలకు దిగాయి. మంగళగిరి నియోజక వర్గంలోని నవులూరులో స్వల్ప ఘర్షణ జరిగింది. తాడికొండ నియో జకవర్గం నిడుముక్కలలో పోలింగ్ ముగిసిన అనంతరం టీడీపీ మద్దతుదారుల ఇళ్లపై వైసీపీ వర్గీయులు రాళ్ల దాడికి దిగారు.

కాసును తరిమిన ఓటర్లు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని నడికుడి ఓటర్లు పరుగులు పెట్టించారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలించే పేరట అక్రమాలకు ప్రయత్నించిన ఆయన్ను ఓటర్లు ప్రశ్నించారు. తమనే ప్రశ్నిస్తారా అని ఆయన అనుచరులు దాడులకు ప్రయత్నించి, మహిళలను బూతులు తిట్టారు. దాంతో పోలింగ్ బూత్ లో ఉన్న ఓటర్లు ఎమ్మెల్యే కాసుకి ఎదురు తిరిగారు. మా ఊరు వచ్చి మామీదే దౌర్జన్యం చేస్తారా అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారు. దీంతో అక్కడున్న ఓటర్లు రాళ్లు తీసుకుని వెంట పడటంతో కాసు అక్కడి నుంచి పరుగులు పెట్టారు.

- మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు రెచ్చిపోయారు. మాచర్ల పట్టణంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి టీడీపీ కార్యకర్తలను కారుతో తొక్కించారు. ఈ సంఘటనలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఓ టీడీపీ నేత ఇంటిని దగ్గరుండి ధ్వంసం చేయించారు. రెంటచింతల మండలం రెంటాలలో గుంటూరు రేంజ్ ఐజీ ఎదుటే జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి కళ్లలో కారం కొట్టి హత్యాయత్నానికి ఒడిగట్టారు. అనంతరం రెండు కార్లను ధ్వంసం చేసి ఓ కారును తగలబెట్టారు.
- దాచేపల్లిలో టీడీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేసి వైసీపీ వర్గాలు గాయపరిచాయి. తంగెడలో బాంబులతో వైసీపీ వర్గాలు దాడులకు దిగాయి. ఎరికేపల్లిలో టీడీపీ కార్యకర్త వాహనాన్ని ధ్వంసం చేశారు.
- నరసరావుపేట మండలం దొండపాడులో వైసీపీ శ్రేణులు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడి చేశాయి. ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లను ధ్వంసం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్ర వద్ద టీడీపీ అభ్యర్థి అరవిందబాబుపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలోనే దాడి చేశారు. అరవిందబాబు కారుతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. గోపిరెడ్డి ఆస్పత్రి, టీడీపీ కార్యాలయంపై ఇరు పక్షాలకు దాడులు చేసు కున్నాయి. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. పరి స్థితిని అదుపుతోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయో గించారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరు వర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. చిలకలూరి పేట నుంచి వస్తున్న శ్రీకృష్ణ దేవరాయల కాన్వాయ్‌ను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ఓ కారులోని వారిని కిందకు దించి పెట్రోల్ పోసి తగలబెట్టారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు.
- సత్తెనపల్లి నియోజకవర్గం తొండపి, రూపెనగుంట్ల, చీమల మర్రి, కుంకలగుంట, గుళ్లపల్లి గ్రామాల్లో రాళ్ల కర్రలతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ సంఘటనలలో పలువురు కార్య కర్తలు గాయ పడ్డారు. క్రోసూ రు మండలం ఎర్రబాలెం, దొ డ్లేరు గ్రామాల్లో పరస్పర దాడు లు జరిగాయి.
- దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ మూకలు దాడులు చేశాయి.
- గుంటూరు కొరిటెపాడులోని సాయి ఆదిత్య స్కూల్ పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఆ తర్వాత టీడీపీ వారు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ వైసీపీ అభ్యర్థిని విడదల రజిని అనుచరులతో అక్కడకు వచ్చి టీడీపీ కార్యకర్తపై దాడికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని శాంతింప చేశారు. అక్కడే మరోసారి అనుచరులతో రజని, అప్పిరెడ్డి హల్చల్ చేశారు. విడదల రజని నేరుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఎన్నికల అధికారి పై తీవ్ర అగ్రహారం వ్యక్తం చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేక బలగాలతో అక్కడకు వచ్చి ఇరువర్గాలను అక్కడ్నుంచి లాఠీకి పనిచెప్పి తరిమేశారు. చుట్టుగుంట సెంటర్ అగ్రికల్చర్ ప్రైసెస్ బోర్డు, లిటిల్ ఫ్లవర్ స్కూల్, గుజనగుండ్లలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఎస్వీఎన్ కాలనీలోని చిన్మయ స్కూల్లో తదితర కేంద్రాల వద్ద కూడా వైసీపీ శ్రేణులతో కలిసి మంత్రి రజిని హల్‌చల్ చేశారు.
- తెనాలి మండలం కోపల్లె గుడివాడ బూత్‌లో మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు ఉండి ఓటర్లను ప్రభావితం చేస్తుండటంపై టీడీపీ, జనసేన నాయకులు అభ్యంతరం చెప్పారు. దీంతో పోలీసులు వారిని బయటకు పంపేందుకు ప్రయత్నించగా ఓ కానిస్టేబుల్‌పై దాడికి యత్నించారు. రజక చెరువు దగ్గర మూడు దఫాలుగా చిన్నపాటి ఘర్షణలు జరిగాయి. లవకుశలు ఆసుపత్రి రోడ్‌లోనూ పలు దఫాలుగా కవ్వింపు చర్యలకు దిగారు.



ఎస్వీఎన్ కాలనీలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



గార్డెన్ అంధుల హాస్టల్‌లో బారులు తీరిన ఓటర్లు





బాపట్ల, పొన్నూరులో వేగేశన, నరేంద్ర



పిడుగురాళ్లలో యరపతినేని దంపతులు



వినుకొండలో జీవీ ఆంజనేయులు దంపతులు





సత్తెనపల్లిలో కన్నా, తెనాలిలో మనోహర్



గుంటూరు విద్యానగర్ లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఓటింగ్ సరళని పర్యవేక్షించి బయటికి వస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరులో టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎస్పీ



తెనాలిలో వర్షం నీటిలో ఓటు వేసేందుకు నిలబడిన ప్రజలు















గుంటూరులో లావు, పెదకూరపాడులో ప్రవీణ్, బుర్రిపాలెంలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, గుంటూరు తూర్పులో నసీర్, పశ్చిమలో మాధవి, మంగళగిరిలో లోకేశ్, ప్రత్తిపాడులో రామాంజనేయులు దంపతులు

పోలింగ్ రోజున వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో తెగబడ్డాయి. పల్నాడు వ్యాప్తంగా భయాందోళనలు సృష్టించాయి. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కార్లను ధ్వంసం చేశాయి. కొన్ని వాహనాలకు నిప్పు పెట్టాయి. వైసీపీ దుశ్చర్యల్లో పదుల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తెనాలిలో స్థానిక ఎమ్మెల్యే ఏకంగా ఓటరు చెంప పగలగొట్టడం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓటమి భయంతోనే ఇటువంటి దాడులకు పాల్పడ్డారని టీడీపీ ఆరోపిస్తోంది.

వైసీపీ మూకల.. అరాచకం

- ఎన్నికల సందర్భంగా పల్నాడులో బరితెగింపు
- కూటమి అభ్యర్థులే లక్ష్యంగా దాడులు
- కార్లు ధ్వంసం..
- గ్రామాల్లో అల్లర్లు.. టీడీపీ శ్రేణులపై దాడులు
- బాపట్ల జిల్లాలోనూ వైసీపీ దౌర్జన్యకాండ

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

- రెండు కార్లు ధ్వంసం.. ఒక కారు దగ్ధం


వైసీపీ మూకలు ధ్వంసం చేసిన బ్రహ్మారెడ్డి వాహనం


దగ్ధమవుతున్న బ్రహ్మారెడ్డి స్కార్పియో కారు

రెంటచింతల, మే 13: మండలంలోని రెంటాల గ్రామంలో ఉదయం 6 గంటల 20 నిమిషాలకే టీడీపీకి చెందిన ఏజెంట్లతో సహా ఇతరులను వైసీపీ వర్గీయులు పురవీధుల్లో తన్నుకుంటూ దుర్భాషలాడారు. కర్రలు కొడవళ్లతో దాడి చేయడంతో టీడీపీకి చెందిన ఆరుగురు గాయపడ్డారు. వారిలో చేరెడ్డి మంజుల, చేరెడ్డి గోపాలరెడ్డిలకు బాగా గాయాలయ్యాయి. వీరిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి గురజాల వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి రెంటాలకు వచ్చి గంట ఇరవై నిమిషాలు అక్కడే ఉన్నారు. ఆ తరువాత టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్ రానీయకుండా వైసీపీ గూండాలు కర్రలతో హల్‌చల్ చేశారు. బ్రహ్మారెడ్డి 11.40గంటలకు గ్రామంలోకి మళ్లీ వచ్చారు. 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌ల దగ్గరకు వచ్చి విజయవాడ ఎస్పీ సుప్రజకు జరిగిన పరిణామాలను వివరిస్తున్న సమయంలో మహిళలు బ్రహ్మారెడ్డిని ఏకవచనంతో సంబోధిండంతో పాటు కారం చల్లారు. బ్రహ్మారెడ్డి వంగడతో ఆ కారమంతా భుజాల మీద పడింది. వెనుక ఉన్న పాత్రికేయుల కళ్లు కారంతో నిండిపోయాయి. మహిళలంటే గౌరవం లేదా.. ఇదేమి సంస్కృతి.. కనీసం మమ్ములను వెళ్ళనీయకుండా అడ్డుకుంటారేందని విజయవాడ ఎస్పీ సుప్రజ ఆగ్రహంతో ప్రశ్నించారు. కొద్ది నిమిషాల వ్యవధిలో పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేశారు. ఒక స్కార్పియో వాహనాన్ని దొర్లించారు. బోర్లా పడేసిన వాహనానికి వైసీపీ మూకలు నిప్పు పెట్టారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనలను జిల్లా ఎస్పీ బిందూ మాధవ్‌కు తెలిపారు. అలాగే ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి కూడా రెంటాలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

గ్రామంలోకి వచ్చిన బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నించారు. కొంత మంది యువకులు కర్రలతో హల్‌చల్ చేశారు. అసలు బ్రహ్మారెడ్డిని ఊళ్ళోకి రానీయకుండా చూడాలనేది వైసీపీ వ్యూహం. కానీ రెండు సార్లు రావడంతో వారు జీర్ణించుకోలేకపోయారు. ఊరి చివరన కర్రలతో దాడులు చేయడానికి ఉపక్రమించగా పోలీసులు తరిమికొట్టారు.




ఎమ్మెల్యే సోదరుడు, అతని గ్యాంగు చేసిన దాడిలో గాయపడిన టీడీపీ నేతలు

బీభత్సం సృష్టించిన ఎమ్మెల్యే సోదరుడు

- 50 బైకులు, 10 కార్లతో పట్టణంలో హల్‌చల్

మాచర్లటౌన్, మే 13: స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజున పట్టణంలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్‌లో అధికసంఖ్యలో ఓట్లు పోలవడం, ఇవి టీడీపీ సానుభూతిపరులవి కావడంతో ఆగ్రహించిన వెంకట్రామిరెడ్డి తన గ్యాంగ్‌తో సుమారు 50 బైకులు, 10 కార్లతో అక్కడకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న టీడీపీ నేతల వాహనాలపై కార్లను ఎక్కించారు. అంతటితో ఆగక టీడీపీ నేతలను డీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో ఆదూరి అల్లెయ్య, ఫిరోజ్, షాజిద్, మల్లెల గోపి (డీజే)లకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఇల్లు, కారును ధ్వంసం చేశారు. ఇంట్లోని ఫర్నీచర్, సామాన్లు ఇంటి నుంచి బయటకు లాగి ధ్వంసం చేశారు. సుమారు 50 మంది టీడీపీ నేతల గృహాల్లోకి దూరి బీభత్సం సృష్టించారు. గంటపాటు ఆ ప్రాంతమంతా అలజడి సృష్టించారు.

రెచ్చిపోయిన వైసీపీ మూకలు


వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం

వెల్దుర్తి, మే 13: మండలంలో సోమవారం పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అలజడులు సృష్టించారు. టీడీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కొన్నారు. లోయపల్లిలో పోలింగ్ ప్రారంభమైన గంటలోనే టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గొట్టిపాళ్లలో టీడీపీ నేతల గృహాలపై రాళ్ల, సీసా బాటిళ్లు విసిరి భయభ్రాంతులకు గురి చేశారు. టీడీపీ కార్యకర్త రాజబోయిన శ్రీహరికి గాయాలయ్యాయి. జనసేన కార్యకర్త మాదాసు నాగరాజుకు చెందిన బొలేరోకు వైసీపీ మూకలు నిప్పంటించి దగ్ధం చేశాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంలోని 118వ బూత్‌లో టీడీపీ ఏజెంట్లు రేఖానాయక్, హనుమంతునాయక్‌లపై దాడి చేశారు. రేఖానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ వెంకయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్లగా వైసీపీ మూకలు అతనిపై దాడి చేసి గాయపరిచారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. పట్లవీడులో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ కార్యకర్తను టీడీపీ నేతలు గుర్తించి ప్రశ్నించారు. మీరెవరు ప్రశ్నించడానికి అంటూ వైసీపీ నేతలు దాడులకు దిగారు. మరసపెంటకు చెందిన టీడీపీ నేత రెడ్యానాయక్ కారుపై వైసీపీ నేతలు రాళ్ల దాడి చేసి ధ్వంసం చేశారు. ఇదే గ్రామంలో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పుల్లారెడ్డి వాహనాన్ని వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. కండ్లకుంటలోని 120 బూత్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయంకు కారణమైన లైన్‌మ్యాన్‌ను రామాంజినేయులును విధుల నుంచి తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ ఆదేశించారు.


తంగెడలో వైసీపీ నేతలు విసిరిన పెట్రోలు బాంబులకు మండుతున్న మంటలు


వైసీపీ మూకల దాడిలో గాయపడిన సురేష్, శ్రీనులను పరామర్శిస్తున్న ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ నేతల దుశ్చర్య

- జానపాడు, కరాలపాడులో వైసీపీ నేతల వీరంగం

పిడుగురాళ్ల, మే 13: మండలంలోని జానపాడులో టీడీపీ కార్యకర్తలైన వున్నం సురేష్, వున్నం శ్రీనులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటంతో తలకు గాయాలవగా పిడుగురాళ్ల ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వీరిని ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా కరాలపాడు గ్రామంలోనూ పోలింగ్ ముగిసే సమయంలో వైసీపీ నేతలు కర్రలతో బీభత్సం సృష్టించి క్యూ లైన్‌లో వున్న ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా ఎగబడ్డారు. అడ్డొచ్చిన పోలీసుపై కూడా చేయి చేసుకున్నట్లు సమాచారం. తంగెడ గ్రామంలో వైసీపీ నేతలు పెట్రోలు బాంబులతో, రాళ్లతో వీరంగం సృష్టించారు. పెట్రోలు బాంబులు విసురుతూ గ్రామస్తులను, టీడీపీ శ్రేణులను భయాందోళనకు గురిచేశారు.

అనగానిపై దాడికి యత్నం

రేపల్లె, మే 13: రేపల్లె పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో ఉదయం నుంచే వైసీపీ నాయకులు బూత్‌లో హల్‌చల్ చేశారు. టీడీపీ బూత్ ఏజంట్లపై దాడికి యత్నించారు. సాయంత్రం 4గంటల సమయంలో పట్టణంలోని బూత్‌లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓపెన్ థియేటర్ బూత్‌లోకి పరిశీలించేందుకు వెళ్లారు. వైసీపీ మూకలు ఎమ్మెల్యే అనగానిపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడి 20 రోజుల్లో తల తీసుకుని వెళ్తానంటూ మీదకు వచ్చారు. వైసీపీ నాయకుడ్ని ఒక దెబ్బ వెయ్యగా పక్కన ఉన్న టీడీపీ, వైసీపీ నాయకులు తోపులాట జరిగింది. సమీపంలో ఉన్న పోలీసులు ఇరువురికి సర్దిచెప్పి పంపారు. వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఫిర్యాదు చేశారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ దాడులు..


వైసీపీ దాడిలో గాయ పడ్డ జనసేన నేత రాడ్ల శ్రీను, తొండపికి చెందిన టీడీపీ కార్యకర్త

సత్తెనపల్లి, మే13: ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు బిగ్గినేని చిన వెంకట్రామయ్య, రాయిడి రామారావు, రాయిడి బాపయ్య, షేక్ ఖాజావలి, నల్లబోతు శ్రీను, చల్లా పిచ్చయ్యలపై వైసీపీ కార్యకర్తలు రాళ్ళు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. రాజుపాలెం మండలం బలిజేపల్లిలో ఓటు వేసేందుకు వెళ్తున్న టీడీపీ నేత పల్లపాటి రాములుపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తలకు గాయం కావటంతో అతనిని వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి మండలంలోని ఫణిదంలోని రామచంద్రాపురం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు కోరంపల్లి సునీత, వడ్డెరపు లీలావతిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడులో పాగోలు బాజీ అనే ఓటరుపై ఎస్ఐ లాఠీతో దాడి చేయటంతో అతని కాలి వెముక విరిగింది. సత్తెనపల్లి పట్టణం 23వ వార్డుకు చెందిన జనసేన నేత వల్లె శ్రీనివాసరావు, జనసేన కార్యకర్త చౌదరి అనిఇల్ పై కూడా వారి ఇంటి వద్దనే రాడ్లతో తలపై తీవ్రంగా దాడి చేశారు. ముప్పాళ్ళ మండలం మాదలలో కూడా పోలింగ్ కేంద్రం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు.

అంబటి అల్లుడిపై తిరుగుబాటు

సత్తెనపల్లి, మే 13: మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉమేష్ చౌదరి ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో సోమవారం హల్‌చల్ చేశారు. గ్రామానికి వెళ్ళి పోలింగ్ బూత్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను నా కొ..., ఎవర్రా మీరు, ఇక్కడ మీ పోజులు ఏంటని? దౌర్జన్యం చేయబోయారు. ఉమేష్ కారులో నుంచి కర్రలు, రాడ్లను వైసీపీ నాయకులు బయటకు తీసి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరగబడ్డారు. మంత్రి అంబటి అల్లుడిని గ్రామంలో నుంచి తరిమి వేశారు.

లావు శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ మూకల దాడి

దొండపాడు(నరసరావుపేట రూరల్), మే 13: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం దొండపాడు గ్రామంలో ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు పోలింగ్‌బూత్‌ను పరిశీలించేందుకు వెళ్ళడంతో గ్రామానికి చెందిన వైసీపీ మూకలు లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడికి పాల్పడ్డారు. లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన మూడు కార్లను రాళ్ళు కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారు.


దొండపాడులో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ గూండాల దాడిలో దెబ్బతిన్న కార్లు

అట్టుడికిన నరసరావుపేట

- రబ్బరు తుటాలు ప్రయోగించిన పోలీసులు
- పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత
- ఇరువర్గాల కార్లు ధ్వంసం
- ఎంపీ లావు కాన్వాయ్‌లోని కారును దహనం చేసిన వైసీపీ మూకలు


వైసీపీ మూకలు దహనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని కారు

నరసరావుపేట, మే13: నరసరావుపేట పట్టణంలో వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. టీడీపీ అభ్యర్థి అరవింద బాబుతో పాటు పలువురు నేతల కార్లను ధ్వంసం చేశాయి. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. ఇరువర్గాల దాడుల పరంపరతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయోగించారు. ఇరువర్గాలు నేతల కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున మోహరించాయి. వైసీపీ కార్యకర్తలు టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని ఒక కారును దహనం చేశాయి.

పట్టణంలో సాయంత్రం మూడు గంటల సమయంలో మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేస్తున్న వారిని టీడీపీ అభ్యర్థి ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులతో స్కూల్ వద్దకు వచ్చాడు. అటుగా వస్తున్న టీడీపీ అభ్యర్థి అరవిందబాబు కారుపై గోపిరెడ్డి అనుచరుడు రాయితో కారును ధ్వంసం చేశాడు. ఈ కాన్వాయ్‌లోని పలు కార్లను కూడా గోపిరెడ్డి అనుచరులు ధ్వంసం చేశారు. అరవిందబాబుపై దాడికి ప్రతి దాడికి టీడీపీ శ్రేణులు పాల్పడ్డాయి. గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఉన్న కార్లను ధ్వసం చేశాయి. ఆస్పత్రి కిటికీ అద్దాలను రాళ్లు రువ్వి పగలు గొట్టాయి. దాడి సమాచారం తెలుసుకున్న గోపిరెడ్డి తన అనుచరులతో తన ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఈ దాడికి ప్రతిగా టీడీపీ కార్యాలయంపై దాడికి పూనుకున్నారు. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు తొలుత లాఠీ చార్జ్ చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రబ్బరు తుటాలను ప్రయోగించి పరిస్థితిని అదుపు చేశారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరువర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. ఈ సందర్భంలో చిలకలూరిపేట నుంచి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ కాన్వాయ్ ఆ ప్రాంతం గుండా వస్తోంది. కాన్వాయ్‌లో చివరి కారును వైసీపీ కార్యకర్తలు అడ్డుకొని కారుపై దాడి చేశారు. కారులో వారు కిందకు దింపి కారుపై ఇంధనం పోసి తగులబెట్టారు. రెండు వైపులా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. పట్టణంలో పరిస్థితులు పోలీసుల అదుపులోకి రాలేదు. పట్టణంలో దాడులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఓటరుపై దాడి హేయం

- దాడిని ఖండించిన పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటి
- గుంటూరు ఆసుపత్రిలో పరామర్శించిన పెమ్మసాని, రాజకుమారి

తెనాలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఓటరుపై చేయిచేసుకుని చెంపపై కొడితే, అంతే వేగంగా ఓటర్ కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించాడు. ఇంతలోనే ఎమ్మెల్యే శివకుమార్ అనుచరులు మూకుమ్మడిగా అతనిపైపడి విచక్షణా రహితంగా దాడిచేశారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐతానగర్ ఎర్రబడిలో సోమవారం జరిగిన ఈ ఘటనలో బాధితుడు సుధాకర్ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తదితరులు పరామర్శించారు. అతని మేమంతా అండగ ఉంటామని ధైర్యం చెప్పారు.


గుంటూరు జిల్లా సమగ్ర వైద్యశాలలో సుధాకర్‌ను దాడి జరిగిన వివరాలు అడిగి తెలుసుకుంటున్న పెమ్మసాని

ఘటన గురించి బాధితుడు, ఓటరు సుధాకర్ ఇలా వివరించారు.. బాధ్యతగా ఉండాల్సిన ఎమ్మెల్యే తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేను మద్యం మత్తులో ఉన్నానని, అసభ్యంగా మట్లాడానని, ఎవరినో కులం పేరుతో దూషించానని, నిందలు వేయటం సరికాదు. మద్యం సేవించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా నేను సిద్ధమే. ప్రస్తుతం ఆసుపత్రిలోనే ఉన్నాను కనుక నా రక్తం తీసుకుని పరీక్షించుకోవాలని, మద్యం సేవించినట్టు నిర్ధారణ అయితే నాకేసు వెనక్కు తీసుకుని, నాపై చర్యలు తీసుకోవాలని నేనే కోరతానన్నారు.

పోలింగ్ శాతం తగ్గించే కుట్ర...

ఓటర్లపై ఎమ్మెల్యే స్థాయి వ్యక్తే చేయిచేసుకోవటం, వారి అనుచరులు దాడులు చేయటం ప్రజాస్వామ్యంలో మంచిదికాదని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. చెంప దెబ్బతో మీరు ఓటరును బెదిరించాలని చూస్తే, మీకు అంతే వేగంగా దాని పర్యవసానం కనిపిస్తుంది. భయపెట్టి పోలింగ్ జరగకుండా చూద్దామనే ప్రయత్నాలను అధికార పార్టీ మానుకోవాలని అన్నారు.

మీ ప్రవర్తన చూసి జనమే మీ చెంపపై తిప్పికొట్టారు..

ప్రజాస్వామ్యంలో ఓటరే దేవుడు. అటువంటి దేవుడిని జాగ్రత్తగా చూసుకోవలసిందిపోయి దాడిచేస్తారా? ఐతానగర్‌లో సుధాకర్‌పై జరిగిన దాడిని జనసేన, టీడీపీ, బీజేపీ తరఫున ఖండిస్తున్నాం. అని తెనాలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సుధాకర్‌పై దాడిచేసిన వారంతా అటువంటి చరిత్ర ఉన్నవారని తెలిసి పోలింగ్ స్టేషన్ లోపలకు పోలీసులు ఎట్లా అనుమతిస్తారంటూ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఓటర్‌ని కొడితే ఓట్లు పడతాయా..?

ఇంకెంత కాలం దాడులు చేస్తారు? ఇంకెంతకాలం పాలన సాగుతుందనుకుంటున్నారంటూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. సుధాకర్‌పై దాడిని ఖండించారు. ఓటర్‌ను కొడితే ఓట్లు ఎట్లాపడతాయనుకుంటున్నారో నాకు అర్థం కావటంలేదని, ఎంతో అనుభవం ఉందని చెప్పే అధికార పార్టీ నేతలు ఆ చిన్న లాజిక్ ఎన్నికల వేళ ఎట్లా మర్చిపోయారో అర్థం కావటం లేదన్నారు. ప్రజల తీర్పు వారి విముక్తిని కోరుకుంటోందని ఆయన అన్నారు.

వైసీపీ దౌర్జన్య కాండ


నిబంధనలకు విరుద్ధంగా పేరలి పోలింగ్‌బూత్‌లోకి అనుచరులతో కలిసి వెళ్లిన కోన వెంకట్

బాపట్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. చీరాల మండలం గవినివారిపాలెంలో వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య గ్రామానికి చేరుకుని పోలీసుతో మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా వైసీపీ రౌడీ మూకలు ఆయనపైకి దూసుకొచ్చారు. ఈ క్రమంలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కర్రలు, రాడ్లు పెట్టుకుని వైసీపీ శ్రేణులు అరాచకం సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.

కోన వెంకట్ అనుచరులను వెంటేసుకుని...

కర్లపాలెం మండలం లోని పోలింగ్ బూత్‌ల వద్ద కోన వెంకట్ తన అనుచరులను వెంటేసుకుని హంగామా సృష్టించారు. ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై దాడికి వైసీపీ మూకలు తెగబడ్డాయి. దళితులపై దాడి చేసి మళ్లీ ఎందుకు వచ్చావని కర్లపాలెం మండలంలోని పేరలి బూత్ వద్ద దళిత యువకులు ప్రశ్నించారు. వెంటనే వైసీపీ మూకలు దాడి చేయడంతో దళితులైన ప్రేమచంద్, పవన్‌లకు గాయాలయ్యాయి.

ఏట్రావారిపాలెంలో..

కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెం బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ శ్రేణులు దాడి చేయబోయాయి. పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. పరస్పర ఘర్షణలలో వైసీపీ కార్యకర్తలు ఇద్దరికి గాయలయ్యాయి. కొల్లూరులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతో టీడీపీ శ్రేణులు గట్టిగా స్పందించాయి. రేపల్లెలోని ఓ పోలింగ్ బూత్‌ను సందర్శించడానికి వెళ్లిన టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌పై వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. రాంబొట్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో టీడీపీ కార్యకర్తకు తల పగిలింది.

టీడీపీ నాయకులపై రాళ్లవర్షం


దాచేపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరామర్శిస్తున్న యరపతినేని


కేశానుపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన రామకోటయ్యను పరామర్శిస్తున్న ఎంఎల్‌సీ జంగా

దాచేపల్లి, మే 13: ఎన్నికల నేపథ్యంలో సోమవారం కేశానుపల్లి గ్రామంలో వైసీపీ నేతలు టీడీపీ నాయకులైన నెల్లూరి రామకోటయ్యను దుర్భాషలాడుతూ దాడిచేసి తల పై కొట్టారు. ఈ ఘటనలో నెల్లూరి రామకోటయ్య తలకు బలంగా గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. సమాచారం అందడంతో ఏం జరుగుతుందో తెలుసుకుందామని ఇరికేపల్లి గ్రామానికి నడి కూడికి చెందిన టీడీపీ నాయకులు ద్విచక్ర వాహనాలలో తరలివెళ్లారు. ఇదే అదునుగా భావించి వైసీపీ నేతలు రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనతో టీడీపీ నేతలు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి పరుగులు తీశారు.

ఇదిలావుండగా దాచేపల్లిలో దొంగఓట్లకు పాల్పడుతున్నారంటూ టీడీపీ నేతలు వాదనకు దిగడంతో వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు టీడీపీ కార్యకర్త కనిశెట్టి రవీంద్రను రాయితో తలపై మోదడంతో తలకు గాయమైంది. ఇదే సమయానికి కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పాఠశాలకు చేరుకొని గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరా మర్శించి ధైర్యం చెప్పారు. తంగెడ గ్రామంలో ఒక్క ఓటు విషయంలో ఏర్పడిన చిన్నవివాదం చిలికిచిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, నాటుబాంబు లు వేసుకోవడం, పెట్రోలు బాంబులతో దాడులుచేయడంతో యుద్ధ వాతావరణం ఏర్పడింది. రెండు ద్విచక్రవాహనాలు కూడా దగ్ధమైనట్లు సమాచారం. కేశానుపల్లి గ్రామానికి చెం దిన టీడీపీ నేత నెల్లూరి రామకోటయ్యపై వైసీపీ నాయకు లు దాడిచేసి గాయపరిచారని సమాచారం అందుకున్న ఎం ఎల్‌సీ జంగా కృష్ణమూర్తి అక్కడికి చేరుకొని రామకోటయ్య ను జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. నడికూడి గ్రామంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కాన్వాయ్‌పై కూడా కొంత మంది వ్యక్తులు రాళ్లు విసిరినట్లు సమాచారం. దీంతో వైసీపీ నేతలంతా నడికూడి చేరుకోవడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడిం ది. దాచేపల్లిలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య తోపులాట జరిగింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



గుంటూరు పశ్చిమలో ఓటు హక్కు వినియోగించుకున్న గల్లా జయదేవ్, కుటుంబం

ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ నేతలు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ నేత చిట్టాబత్తిన చిట్టిబాబు గుంటూరు తూర్పులో వెంగళరావు నగర్ పోలింగ్ బూత్ నెం.43లో, ఎంపీ గల్లా జయదేవ్, ఆయన భార్య పద్మ, కుమారులు హీరో అశోక్, సిద్ధర్థ్ పట్టాభిపురంలోని బేసిక్ హైస్కూల్‌లో బూత్ నెంబర్ 44లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుంటూరు పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి లిటిల్ ఫ్లవర్స్ స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హిందూ కాలేజీలో బూత్ నెంబరు.167లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్ తన ఓటు హక్కును స్థానిక ఎల్ బి నగర్ లోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలో వినియోగించుకున్నారు. గుంటూరు బీఆర్ స్టేడియం ఎదుట వున్న సోషల్ వెల్ఫేర్ బిల్డింగులో ఏ ర్పాటు చేసిన పోలింగ్ బూతు నెంబరు 149లో కూటమి అభ్యర్థి నసీర్ తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు.



కలెక్టరేట్ ఎదురు ఇరిగేషన్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి, ఆమె భర్త బి.సునీల్ కుమార్‌రెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ షౌకత్ - గుంటూరు (కార్పొరేషన్).

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

గుంటూరు సిటీ, మే 13 :ఓటమి భయంతోనే వైసీపీ టీడీపీని టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడిందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. వైసీపీ దొంగఓట్లు వేసే ప్రయత్నాన్ని ప్రభాకర్ అడ్డుకున్నారు. బూత్‌లోకి వైసీపీ నాయకులు అక్రమంగా చొరబడి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. వైసీపీ చేస్తున్న అరాచకాలను అడ్డుకోవాలని పోలీస్ అధికారులతో ప్రభాకర్ వాగ్వాదానికి దిగారు. ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను వైసీపీ నాయకులు కావాలనే బయటనుంచి జనాలను తెచ్చి గొడవలకు దిగారని ఆరోపించారు. వైసీపీ అరాచక పాలనను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు కంకణం కట్టుకొని ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చారన్నారు.



గుంటూరు ఎస్పీకి పోలింగ్ కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితిపై ఫిర్యాదు చేస్తున్న డేగల ప్రభాకర్

తెనాలి దాడి ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, మే 13 : తెనాలిలో పోలింగ్ బూత్‌లోకి అక్కడి ఎమ్మెల్యే అనుచరులతో అక్రమంగా ప్రవేశిస్తున్నారని ప్రశ్నించిందుకు ఓటరుపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ నేతలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం మధ్యాహ్నం గుంటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిత్తాబత్తిన శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పోలింగ్ బూత్‌లోకి అక్రమంగా ప్రవేశించటానికి ప్రయత్నించడమే కాక ఓటర్లపై దాడి చేయడం దారుణమని వారు కలెక్టర్‌కు వివరించారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యేతో పాటు, ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి విడదల రజినీ కోడ్ ఉల్లంఘన

- పోలింగ్ రోజునా వాయిస్ కాల్స్, మెసేజీలు
- టీడీపీ నేతల ఫిర్యాదు

గుంటూరు, మే 13: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ ఎన్నికల రోజు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించారు. ఒక వైపు పోలింగ్ జరుగుతుండగా మరో వైపు సెల్ ఫోన్‌లో వాయిస్ కాల్స్, వాయిస్ మెస్సేజ్‌లతో ఓటర్లను మభ్య పెట్టేలా ప్రచారం చేశారు. ఈ మేరకు సెల్‌ఫోన్‌లలో వాయిస్ కాల్స్, మెస్సేజ్‌ల సాక్షాలుగా చూపుతూ టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎన్నికలకు ముందే శనివారం సాయంత్రం 5 గంటల నుంచే రాజకీయ పార్టీల ప్రచారాలు నిలిపివేసేలా ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం, సోమవారం యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తూ మంత్రి విడదల రజినీ వాయిస్‌కాల్స్, మెస్సేజ్‌లు వచ్చాయి. కొరిటపాడు ప్రాంతం సమీపంలోని రాయపాటి వీరయ్య చౌదరి ప్రాథమిక పాఠశాల బూత్‌లో దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ ప్రయత్నం చేస్తోందని వైసీపీ నాయకులు కొద్ది సేపు గందరగోళం చేశారు. సమాచారం తెలుసుకున్న మంత్రి రజినీ, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిలు బూత్ వద్దకు చేరుకోవటంతో అక్కడ టీడీపీ, వైసీపీ కార్యకర్తలకు ఘర్షణ జరిగింది. దాంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. పోలీసులు లాఠీలు ఝుళిపించి ఇరువర్గాలను పంపించేశారు.

రెండు గంటలుపైగా క్యూలో ఉండి వెళితే.. నా ఓటు ఎవరో వేశారు

- సయ్యద్ ఆరిఫా బేగం ఆవేదన...
- టీడీపీ నాయకులు జోక్యంతో టెండర్ ఓటు



ఆరిఫా బేగం

గుంటూరు, మే 13: రెండు గంటలకు పైగా క్యూలో నిల్చుని వెళితే చివరకు నా ఓటు వేసి ఉందని సిబ్బంది చెబుతున్నారంటూ పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా పోలింగ్ బూత్‌వద్ద ఓ మహిళా ఓటరు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపేటకు చెందిన సయ్యద్ ఆరిఫా బేగం అంజుమన్ ఇస్లామియా స్కూల్లోని 204 పోలింగ్ బూత్‌కు వెళ్ళారు. రెండు గంటలకు పైగా క్యూలో నిరీక్షించి వెళ్ళగా తీరా లోనికి వెళ్ళాక నా ఓటు ఎవరో వేసినట్లు చెప్పారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో అక్కడే ఉన్న కొందరు టీడీపీ నాయకులు జోక్యం చేసుకొని సిబ్బంది దృష్టికి తీసుకెళ్ళగా టెండర్ ఓటుకు అనుమతించినట్లు పేర్కొన్నారు.



గుంటూరు బుచ్చయ్యతోటలోని మురుగునీటిలో ఓటు వేయడానికి ఇబ్బంది పడుతున్న ఓటర్లు - గుంటూరు.

టీడీపీ ఆధిపత్యం ఉన్న పోలింగ్ బూత్‌లే లక్ష్యం

- ప్రశాంత పోలింగ్‌కు భంగం కలిగించడమే వ్యూహం
- అనుచరులతో బూత్‌లలో రజని, అప్పిరెడ్డి హల్‌చల్
- దొంగ ఓటు వేస్తున్నాడని దగ్గరుండి టీడీపీ కార్యకర్తపై దాడి
- పరిస్థితి గ్రహించి రంగంలోకి దిగిన పెమ్మసాని, గళ్ళా
- పలు బూత్‌ల వద్ద ఇరువర్గాల ఘర్షణ
- పోలీసుల లాఠీచార్జి ... పరిస్థితి ఉద్రిక్తం

గుంటూరు, మే 13 : తెలుగుదేశం పార్టీ ఆధిపత్యం ప్రదర్శించే ప్రాంతాలపై వైసీపీ శ్రేణులు కన్నేశాయి. టీడీపీ మెజార్టీ సాధించే పోలింగ్ బూతులే లక్ష్యంగా వైసీపీ నాయకులు దృష్టి సారించారు. అక్కడ ఎలాగైనా ప్రశాంత పోలింగ్‌కు భంగం కలిగించి పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు వ్యూహాత్మకంగా వైసీపీ నాయకులు పావులు కదిపారు. ఈ క్రమంలో ఆయా బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా బూత్‌లలోకి పశ్చిమ వైసీపీ అభ్యర్థిని విడదల రజని, ఎమ్మెల్సీ ఎల్.అప్పిరెడ్డి పెద్ద సంఖ్యలో తమ అనుచరులతో వెళ్లేందుకు యత్నించడం, దానికి ప్రతిగా టీడీపీ శ్రేణులు అడ్డుకోవడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. తొలుత సోమవారం ఉదయం కొరిటెపాడులోని సాయి ఆదిత్య స్కూల్ పోలింగ్ బూత్ వద్ద టీడీపీ కార్యకర్త ల్యాప్‌టాప్ ద్వారా పార్టీ స్లిప్పులు, అదేవిధంగా ఆధార్ కార్డులు ప్రింట్ తీసి ఇస్తున్నాడంటూ వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదానికి, తోపులాటకు దారితీసింది. వైసీపీ కార్యకర్తలు ల్యాప్‌టాప్ గుంజుకోవడంతో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఈ పోలింగ్‌స్టేషన్లో టీడీపీ వారు దొంగ ఓట్లు వేస్తున్నారు అంటూ వైసీపీ అభ్యర్థిని విడదల రజని కార్యకర్తలతో సాయి ఆదిత్య స్కూలు బూత్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఓ టీడీపీ కార్యకర్తను పట్టుకొని దొంగ ఓటు వేస్తున్నావ్ అంటూ విడదల రజని సాక్షిగానే అతనిపై దాడి చేసి కొట్టారు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా ఎదురు తిరగడంతో పోలీసులు ఇరువర్గాలను నెట్టివేసి శాంతింప చేశారు. అక్కడే మరోసారి అనుచరులతో రజని, అప్పిరెడ్డి హల్‌చల్ చేశారు. విడదల రజని నేరుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఎన్నికల అధికారిపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కనీసం 15 నిమిషాలకు పైగా పోలింగ్ బూత్‌లోనే ఉండి సంబంధిత ఏజెంట్లు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంత సమయం పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థిని భర్త గల్లా రామచంద్రరావు, పార్టీ నాయకులు సుఖవాసి శ్రీనివాస్, సిరిపురం శ్రీధర్, కొమ్మినేని కోటేశ్వరరావు, రావిపాటి సాయి కృష్ణ, యరమాల కిరణ్ తో పాటు మరికొందరు కూడా పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేక బలగాలతో అక్కడకు వచ్చి ఇరువర్గాలను అక్కడ్నుంచి లాఠీకి పనిచెప్పి తరిమేశారు.

చుట్టుగుంట సెంటర్ సమీపంలోని రైతు బజార్ వద్ద

చుట్టుగుంట సెంటర్ సమీపంలోని రైతు బజార్ వద్ద గల అగ్రికల్చర్ సైన్సెస్ బోర్డు పోలింగ్ కేంద్రంలోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ అభ్యర్థిని విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలతో అక్కడ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, టీడీపీ వర్గీయులు అడ్డుకునేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. సమాచారం తెలుసుకున్న టిడిపి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, అదే విధంగా గళ్ళా రామచంద్రరావుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఆ పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. చివరకు పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద పెమ్మసాని వర్సెస్ వైసీపీ నేతలు

లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద కొందరు టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ అభ్యర్థి విడుదల రజిని, అప్పిరెడ్డి తదితరులు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పశ్చిమ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి భర్త రామచంద్రరావు పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో స్కూల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ కొంత సమయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని పట్ల అప్పిరెడ్డి పరుషంగా మాట్లాడడంతో పెమ్మసానితో పాటు టిడిపి కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. గేటు లోపల పెమ్మసాని, గేటు వెలుపల విడదల రజిని, అప్పిరెడ్డి, చంద్రగిరి యేసు రత్నం తదితర నాయకులు మకాం వేశారు. దీంతో అక్కడ మరోసారి ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువైపులా ఆయా అభ్యర్థులతో పాటు ఐదుగురిని మాత్రమే ఉండనిస్తామని, మిగిలిన వారందరినీ పంపించాలని ఎస్పీ సూచించారు. పోలీసులు వారించినా టిడిపి, వైసిపి కార్యకర్తలు వెళ్లక పోవడంతో పోలీసులు మరోసారి లాఠీకి పని చెప్పారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పరుగులు తీయడంతో టీడీపీ కార్యకర్త కొల్లి అనిల్ కాలువలో జారిపడి తలకు గాయమైంది. అయితే అక్కడకు వచ్చిన ఓ యువతిని దొంగ ఓటు వేసేందుకు వచ్చావు అంటూ విడదల రజని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చివరకు ఇరు పార్టీల అభ్యర్థులు నాయకులు సాయంత్రం 6 గంటల వరకు అక్కడే మకాం వేశారు. ఆ తరువాత ఎస్వీఎన్ కాలనీలోని చిన్మయ స్కూల్లోకి ఎమ్మెల్యే మద్దాళిగిరి అనుచరులతో చిన్మయ స్కూల్లోకి ప్రవేశించాడనే విషయం తెలుసుకున్న ఆయా వైసీపీ, టిడిపి అభ్యర్థులు చిన్మయ స్కూల్ వద్దకు వెళ్లారు. అయితే అప్పటికే అక్కడ లైన్‌లో ఉన్న మహిళలు ఒక్కసారి గిరిపై దాడికి యత్నించారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న రజిని, అప్పిరెడ్డి అదేవిధంగా చంద్రగిరి యేసురత్నం పార్టీ నాయకులు గుజ్జనగుండ్ల వరకు నడుచుకుంటూ వెళ్లి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

‘తూర్పు’లో పలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన వైసీపీ మూకలు

- సాధు చలమయ్య కళాశాలలో పరస్పరం దాడులు ఉద్రిక్తత
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దు మణిగిన వివాదం



సాధు చలమయ్య కళాశాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణ

గుంటూరు, మే 13: తూర్పు నియోజకవర్గంలో పలు పోలింగ్ బూత్‌లలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏటుకూరు రోడ్డులో ఉన్న సాధు చలమయ్య కళాశాలలో 223 బూత్‌లో ఓ వైసీపీ నాయకుడు అనధికారికంగా ప్రవేశించటంతో ఘర్షణ నెలకొన్నది. తరచూ అనధికారికంగా బూత్‌లోకి రావటంపై టీడీపీ నాయకులు అభ్యంతరం చెప్పగా వైసీపీ నాయకులు ఎదురు దాడికి దిగారు. దాంతో అక్కడ పరస్పరం ఘర్షణ జరగటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఈ ఘటనలో టీడీపీ, వైసీపీ నాయకులు గాయపడ్డారు. స్థానిక పోలీసులు అదుపు చేయలేక అదనపు సిబ్బందికి సమాచారం అందించటంతో హుటాహుటిన తరలివచ్చారు. గాయపడిన వైసీపీ కార్యకర్తను చికిత్సకు తరలిస్తుండగా ఆయన నిరాకరించారు. దాంతో బలవంతంగా ఆయన్ను అక్కడ నుంచి పోలీసులు తరలించారు. దాంతో వివాదం సద్దుమణిగింది. అలానే పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలోనూ వైసీపీ నాయకులు ఆందోళనకు దిగారు. టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు రావాలని, లేకుంటే తాము కూడా బయటకు వచ్చేది లేదంటూ భీష్మించుకు కూర్చోవటంతో అక్కడ కొంత ఆందోళన నెలకొన్నది. చివరకు పోలీసులు జోక్యం చేసుకోవంతో వివాదం సద్దుమణిగింది.

వైసీపీ అరాచకాలతో ఓటర్లను భయపెట్టలేరు : నసీర్

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ తన అరాచకాలతో ఓటర్లను భయపెట్టలేదని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు సంగడిగుంట చలమయ్య కళాశాలలో జరిగిన ఎన్నికల బూత్ 223 దగ్గర వైసీపీ నాయకులు ప్రజలను భయపెట్టి పోలింగ్ ఆపే ప్రయత్నిస్తుండగా ఆ బూత్‌లో ఉన్న టీడీపీ ఏజెంట్ శివ రామాంజనేయులు ఆపడానికి ప్రయత్నించడంతో వైసీపీ నాయకులు ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచార న్నారు. వెంటనే తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంఘటన స్థలానికి చేరుకొని అతనిని రక్షించి 108లో జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ జీజీహెచ్ ఎమర్జెన్సీలో ఉన్న శివ రామాంజనేయులను పరామర్శించి తనకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. నసీర్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు, నూరి ఫాతిమా ఓడిపోతుందని అర్థమై ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు విమర్శించారు. ఓటర్లను ఓటు వేయడానికి బయటికి రానివ్వకుండా చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రజలు ఈ గంజాయి గుట్కా వ్యాపారులను ఇంటికి పంపించేందుకు సిద్ధమయ్యారు, కావున తెలుగుదేశం పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని తేల్చి చెప్పారు. జూన్ 4న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బూత్ ఏజెంట్ శివ రామాంజనేయులు పైన దాడి చేసిన వారిని కచ్చితంగా శిక్షిస్తామన్నారు.



గాయపడిన ఏజెంటుతో మాట్లాడుతున్న మొహమ్మద్ నసీర్

సమయం ముగిసాక కూడా ఆందోళన.....

సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగియటంతో పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఈ ఇస్లామియా స్కూల్‌లోని పోలింగ్ బూత్‌ల ప్రాంగణానికి పోలీసులు గేటు వేశారు. ముగిసే సమయానికి కూడా లోపల క్యూలైన్లు బారులు తీరాయి. అయినప్పటికీ కొందరు ఓటర్లు ఓటు వేసేందుకు వచ్చి ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు లాఠీలు పట్టుకొని హెచ్చరించటంతో వారంతా అక్కడ నుంచి వెనుతిరిగారు. మరో వైపు ఎన్నికలు ముగింపు సమయానికి అంజుమన్ ఇస్లామియా హై స్కూల్ బూత్‌ల ఎదుట వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున గుమిగూడి ఉండటంపై టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. దాంతో సమాచారం తెలుసుకున్న డిఎస్పీ మల్లికార్జునరావు సంఘటన ప్రదేశానికి చేరుకొని ఇరుపక్షాలను అక్కడ నుంచి చెల్లాచెదురు చేయటంతో పరిస్థితి సద్దుమణిగింది.

వైసీపీ అక్రమాలను సమర్థవంతంగా తిప్పికొట్టిన టీడీపీ క్యూఆర్టీ బృందం

గుంటూరు, మే 13 : ఈ ఎన్నికలు ఎలాగైనా నయానా, భయానో విజయం సాధించాలనే ఉద్దేశంతో వైసీపీ చేసిన పన్నాగాన్ని టీడీపీ క్యూఆర్టి టీం సభ్యులు సమర్థవంతంగా తిప్పికొట్టారు. ఈ బృందంలో సభ్యులైన సిరిపురపు శ్రీధర్, రావిపాటి సాయికృష్ణతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ అక్రమాలను అడుగడుగునా అడ్డుకున్నారు. తొలుత ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో వైసీపీ కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ మరికొందరు బూత్ లోపల ఉండి ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు వీరికి సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లిన వీరు లోపల వైసీపీ కార్పొరేటర్‌లు ఉన్న విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు ఎవరూ లేరంటూ సమాధానం ఇచ్చారు. దీంతో క్యూఆర్టి బృంద సభ్యులు సిరిపురపు శ్రీధర్, రావిపాటి సాయి కృష్ణ, నవరం రోహిత్, మానుకొండ శివప్రసాద్, పేరం అనిత తదితరులు గొడవకు దిగారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత దారి తీసింది. చివరకు పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఇరువర్గాల ఘర్షణ

గుజనగుండ్లలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద వైసీపీ కార్పొరేటర్ మార్కెట్ బాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్ద ఉండి ఓటర్లను ప్రభావితం చేయడంతో పాటు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ సమాచారం రావడంతో క్యూఆర్టి బృంద సభ్యులైన శ్రీధర్, రాయపాటి సాయి కృష్ణ తదితరులు తమ అనుచరులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ కళాశాల లోపల బూత్‌లు వద్ద ఉన్న వైసీపీ నాయకులను బయటకు పంపాలని క్యూఆర్టి బృంద సభ్యులు పోలీసులకు సూచించారు అయితే ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి అదుపు తప్పే పరిస్థితి రావడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాబు తనయుడు తలకు గాయమై రక్తస్రావం అయింది అదే సమయంలో టీడీపీ కార్యకర్త చిలుమూరు ఫణి చేతికి బలమైన గాయమైంది.

చిన్మయ స్కూల్ వద్ద వైసీపీ శ్రేణులతో మరోసారి క్యూఆర్టి బృందం ఢీ

ఎస్వీఎన్ కాలనీలోని చిన్మయ స్కూల్ బూతులు వద్ద వైసీపీ నాయకులు ముఖ్యంగా వైసిపి కార్పొరేటర్ మార్కెట్ బాబు తన అనుచరులతో ఓటర్లను ప్రభావితం చేయించడమే గాక దొంగ ఓట్లను ప్రోత్సహిస్తున్నాడు అంటూ క్యూఆర్టీ బృందానికి సమాచారం అందింది. దీంతో శ్రీధర్ రాయపాటి సాయి కృష్ణ తదితరులు అక్కడకు వెళ్లేసరికి లోపలకి తన అనుచరులతో వైసీపీ అభ్యర్థిని విడదల రజిని వెళ్లారు. దీంతో టీడీపీ క్యూఆర్టి బృందం అభ్యంతర వ్యక్తం చేసింది. దీంతో మరోసారి అక్కడ టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదేవిధంగా విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కోవెలమూడి రవీంద్ర అక్కడికి వచ్చి ఆయా బూత్‌ల్లోకి వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు. టీడీపీ క్యూఆర్టి బృందం ఆందోళనతో పోలీసులు దిగివచ్చి అందరినీ బయటకు పంపారు.

తూర్పు ముస్లింల్లో మార్పు

- పోలింగ్ సరళిపై టీడీపీ శ్రేణుల్లో జోష్
- బూత్‌లను ఆక్రమించేందుకు వైసీపీ నేతల యత్నం
- చివర్లో ఓటర్లకు అధికార పార్టీ విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యధికంగా ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ సారి ఆ వర్గాలు మార్పు కోరుకుంటున్నట్లు పోలింగ్ సరళి తెలియచేస్తోంది. రెండు పర్యాయాల నుంచి ఇక్కడ గెలుస్తూ వచ్చిన వైసీపీ ఈ దఫా సైకిల్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్నది. పోలింగ్ సరళి వ్యతిరేకంగా ఉందన్న భావనతో పలుచోట్ల బూత్‌లలోకి ప్రవేశించి వైసీపీ నేతలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారు. చివరి రెండు, మూడు గంటల్లోనూ ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసి పోలింగ్ బూత్‌లకు తరలించారు. బూత్‌లలోకి ప్రవేశించి ఫ్యాన్‌కు ఓటేయమంటూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు నిర్వహించారు. అయితే మహిళలు, యువకులు, శ్రామికవర్గాలు పెద్దఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కు వినియోగించుకున్నాయి. టీడీపీ ఈ దఫా గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నది. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కూడా ఇక్కడే భారీ బహిరంగ సభ నిర్వహించారు. దాంతో ముస్లిం మైనార్టీలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఉదయం 6.30 గంటలకే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులుతీరారు. ముండుటెండని కూడా లెక్క చేయకుండా నిలుచుని మరీ ఓటు వేశారు. ఆంధ్రా ముస్లిం కళాశాల, అంజుమన్ ఇస్లామియా పాఠశాల, యాదవ హైస్కూల్, ప్రభుత్వ ఉర్దూ బాలుర పాఠశాల, నంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కళాశాలలోనే 70కి పైగా పోలింగ్ బూత్‌లు ఉండటంతో అందరూ వీటి పైనే దృష్టి కేంద్రీకరించారు. ముస్లిం మైనార్టీలతో పాటు ఇతర సామాజికవర్గాల ఓటర్లు కూడా మధ్యాహ్నం లోపే తమ ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. దీంతో మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ శాతం గంట గంటకు పెరుగుతూ వచ్చింది. చాలామంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుని బయటకు వస్తూ విక్టరీ సింబల్‌ని చూపించారు.

పలు ప్రాంతాల్లో దాడులు..

ఓడిపోతున్నామన్న భయంతో వైసీపీ నేతలు మధ్యాహ్నం నుంచి దాడులకు తెగబడ్డారు. సంగడిగుంటలోని సాధు చలమయ్య డిగ్రీ కళాశాలలో వైసీపీకి చెందిన డివిజన్ నాయకుడు అక్రమంగా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారు. టీడీపీ ఏజంట్లు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకి దారి తీసింది. టీడీపీ నాయకుడి చేయి విరగగా, వైసీపీకి చెందిన వ్యక్తికి తలపై గాయమైంది. విషయం తెలుసుకొన్న పోలీసులు వెనువెంటనే స్ట్రయికింగ్ ఫోర్స్‌లను దింపి అల్లరి మూకలను చెల్లాచెదురు చేసి తిరిగి పోలింగ్ జరిగేలా చేశారు. అంజుమన్ ఇస్లామియా స్కూలులోని మూడు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని ఓటర్లకు రూ.వెయ్యి చొప్పున పంచి పోలింగ్ కేంద్రానికి తరలించారు. సాయంత్రం ఆరు తర్వాత వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమా బూత్‌లోకి ప్రవేశించి రిగ్గింగ్ చేయాలని ప్రయత్నించారు. దాంతో టీడీపీ శ్రేణుల ఆందోళనతో పోలీసులు ఆమెను బలవంతంగా బయటకు పంపేశారు. మరోవైపు దొంగ ఓట్లు కూడా ఈ బూత్‌లో ఎక్కువగా పోలింగ్ అయినట్లు బాధితులు వాపోయారు. తమకు టెండర్ ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని అధికారులను కోరగా అందుకు వారు ససేమిరా అనడంతో ఆందోళనకు దిగారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి టెండర్ ఓటు వేయడానికి అనుమతి ఇవ్వకపోతే తాము పోలింగ్ జరగనివ్వబోమని చెప్పడంతో అప్పుడు పీవో, ఏపీవో దిగి వచ్చారు. ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన సోదరుడు కర్నుమా, గులాం రసూల్, జియావుర్ రెహమాన్, ముస్తఫా కుమారుడు తదితరులు కార్లలో పోలింగ్ బూత్‌ల వద్ద సంచరించి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించారు.

పోలింగ్ సరళి ఇలా...

తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 50 వేల 691 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సాయంత్రం 5 గంటలకు 1,54,609 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఉదయం 9 గంటలకు 9.2 శాతం, 11 గంటలకు 24.1, మధ్యాహ్నం 1 గంట కల్లా 39.03, 3 గంటలకు 52.10, సాయంత్రం 5 గంటలకు 61.70 శాతం మంది ఓటు వేశారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వచ్చిన వారికి స్లిప్పులు ఇచ్చి ఓటింగ్‌ని కొనసాగించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో బాలకుటీర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),మే 13: సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్(శ్యామలా నగర్) విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాని పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్.మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతికి197 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై 100 శాతం ఉత్తీర్ణతను సాధించారు. తమ విద్యార్థి రేయాన్ 485 మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడని వివరించారు. సబ్జెక్టు వారిగా ఇంగ్లిషు-97, ద్వితీయ భాష-100, మ్యాథ్స్-100, సైన్స్-97, సోషల్-99 మార్కులను విద్యార్థులు సాధించారు. 25 మందికి పైగా 90శాతంపైగా 65 మందికి పైగా 80శాతంపైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, నిరంతర శ్రమ, తల్లి దండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను పాఠశాల సహకార్యదర్శి జయశ్రీ, సిఇవో రఘురాం, ప్రిన్సిపల్ సుధా మాధవి తదితరులు అభినందించారు.

కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల జయభేరి

గుంటూరు(విద్య),మే 13: సీబీఎస్‌ఈ విడుదల చేసిన పది, ఇంటర్ ఫలితాల్లో డాక్టర్ కెఎల్‌పి స్కూల్‌విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12వ తరగతి ఎంపిసిలో పెరుమాల నాగశ్రీష 488, ఎంబైపిలో శ్రీనివాసన్ సహన 464 మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా ఎంపిజి గరికపాటి పావని 443 మార్కులు, బంకా ఆకాశ్ 431 మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా పదిలో అలుగులశెట్టి రాజహంసని 486 మార్కులు, కొండశెట్టి శేషాద్రిసాయి ఆదిత్య 481, షేక్ సమీయాసల్మా 475 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె బసవపున్నయ్య, ప్రిన్సిపల్ వైరధినిచౌదరి, ఏవో వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

ప్రజలు మార్పును కోరుకున్నారు

- ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌శర్మ

గుంటూరు, మే 13: ప్రజలు మార్పు కోరుకున్నారని, సోమవారం జరిగిన ఎన్నికల సరళిలో ప్రజా నాడి తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షల మేరకు ఏకమైన టీడీపీ, జనసేన, బీజేపీల ఎన్‌డిఏ కూటమి అభ్యర్థుల విజయం తథ్యం అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణ సామాజిక వర్గం ఓటర్లు ఎన్‌డిఏ కూటమికి అండగా నిలిచారన్నారు. ఎన్‌డిఏకు మద్దతు తెలియజేసి ఓట్లు వేసినందుకు అందరికీ రాష్ట్రంలోని బ్రాహ్మణ సంఘీయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

టీడీపీ నగర కార్యనిర్వాహక కార్యదర్శిపై దాడి



గాయపడిన కొల్లి అనీల్

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు నగర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లి అనీల్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని లిటిల్ ఫ్లవర్స్ హైస్కూలులోని పోలింగ్ స్టేషన్‌లోకి మంత్రి రజని, లేళ్ల అప్పిరెడ్డి తమ అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి వెళుతుంటే టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా రామచంద్రరావులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వారి తీరును నిరసించారు. ఈ క్రమంలో రజని, అప్పిరెడ్డి తన అనుచరులను పెమ్మసాని, రామచంద్రరావుపైకి శ్రేణులను దాడికి ఉసికొల్పారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. తోపులాటలో టీడీపీ నగర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లి అనీల్‌కు తల పగిలింది. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేశారు.

దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్‌ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన అవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ

ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజిపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net


'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

నవ్య చిత్రజ్యోతి













క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య, విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.


















మాతృభాషలోనూ డబ్బింగ్


దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.



నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు

జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠీ నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠీ నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠీ చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



తెనాలిలో భారీ వర్షం పడినా ఓటు వేసేందుకు నీటిలో నిలబడిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలిలో పెనుగాలులతో కూడిన వర్షానికి కూలిపోయిన ఓటర్ల కోసం వేసిన టెంట్



పొన్నూరులోని ఎంపీడీవో కార్యాలయం పోలింగ్ బూత్ వద్ద రాత్రి 8 గంటలకు ఓటు వినియోగించుకోవటానికి బారులుతీరిన మహిళలు



చెంచుపేట శబరి వృద్ధాశ్రమంలోని పోలింగ్ కేంద్రంలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళకు సేవలందిస్తున్న తోటివారు, వైద్య సిబ్బంది



ఓటు హక్కు వినియోగించుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కుటుంబ సభ్యులు







పొన్నూరు జడ్పీ హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకోవటానికి వేచి చూస్తున్న దివ్యాంగులు, పొన్నూరులో సొమ్మసిల్లిన వృద్ధురాలు, కొల్లిపరలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

పోటెత్తిన ఓటర్లు... అర్ధరాత్రి వరకు పోలింగ్

- తెనాలి నియోజకవర్గంలో 80 శాతంపైనే!
- ఉదయం మందకొడిగా... సాయంత్రం భారీగా
- వర్షంలోనూ వెనక్కి తగ్గకుండా ఓటేసేందుకు
- మోకాళ్లలోతు నీటిలోనే గంటలకొద్దీ నిలబడి మరీ ఓటు

తెనాలి, మే 13, (ఆంధ్రజ్యోతి): తెనాలి నియోజకవర్గంలో ఓటర్లు పోటెత్తారు. మధ్యాహ్నానికే 45శాతం వరకు పోలింగ్ నమోదయితే, మధ్యాహ్నం నుంచి భారీగా తరలివచ్చారు. ఆరు గంటల తర్వాత కూడా జనం పెద్ద సంఖ్యలో ఉండటంతో పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. కాళ్ల కింద వర్షపు నీరు.. పైన దోమలు పీకేస్తున్నా పట్టు వదలకుండా ఓటుకోసం జనం బారులుతీరి ఉండటం ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రత్యేకతగా కనిపించింది. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలు కావలసిఉంటే, చాలాచోట్ల ఈవీఎంలు మొరాయించటం, విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగటం వంటి కారణాలతో తొలుత పోలింగ్ ప్రక్రియకూడా బాగా ఆలస్యంగా కొనసాగింది. చెదురుమదురు ఘటనలు జరిగినా ఓటర్లు మాత్రం తిరిగి వెళ్లలేదు. తెనాలి నియోజకవర్గంలో మొత్తం 2,65,863 మంది ఓటర్లుంటే, ఉదయం 9 గంటల లోపు కేవలం 4.54 శాతం మాత్రమే పోలింగ్ నమోదయింది. మధ్యాహ్నం 3 గంటలకు 45.56 శాతం నమోదయింది. అయితే ఇదే సమయంలో భారీ వర్షం పడటం, ఉరుములు, గాలులతో గంటన్నరసేపు వర్షం పడుతున్నా ఓటర్లు మాత్రం వెళ్లిపోలేదు. కొన్ని పాఠశాలల్లో భారీగా వర్షపు నీరు నిలిచిపోయి మోకాళ్ల దగ్గరకు నీరు నిలిచినా, ఆ నీటిలోనే నిలబడి ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. సాయంత్రం 6 గంటలలోపు 65.69 శాతం పోలింగ్ నమోదయింది. అయితే ఆ తర్వాత కూడా నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల్లో 23 కేంద్రాల్లో పోలింగ్ రాత్రి 12 గంటల వరకు కొనసాగిన పరిస్థితి. తెనాలి పట్టణంలోని బాయిస్ హైస్కూల్, ఐతానగర్, చెంచుపేట, మరికొన్ని రూరల్ గ్రామాల్లో పోలింగ్ కొనసాగింది. అయితే వృద్ధులకు వీల్‌ఛైర్‌లు అందుబాటులో లేక, పాడయిపోయినవి ఉండటంతో అతి కష్టంమీద నడిచే బూత్‌లలోకి వెళ్లాల్సి వచ్చింది. వికలాంగులకూ ఇబ్బందులు తప్పలేదు. అయితే అంత ఇబ్బంది ఉన్నా వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు ఓపికతో వేచిఉండటం విశేషం. అయితే ఈసారి పోలింగ్‌లో ఎక్కువ శాతం మహిళలు, యువత ఎక్కువగా ఉన్నారు. కొత్తగా ఓటు వచ్చిన యువత మాత్రం ఉత్సాహంతో ఓటుహక్కు వినియోగించుకున్నారు. సాయంత్రానికి 65 శాతంపైగా పోలవటం, అర్ధరాత్రి వరకు 23 కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతుండటంతో పోలింగ్ 80 శాతానికిపైగా చేరే అవకాశం ఉందనేది అంచనా.

తెనాలి, మండల గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు

తెనాలి రూరల్, మే 13: తెనాలి పట్టణ, మండల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద చెదురుమదురు ఘర్షణలు మినహా అంతా ప్రశాంతంగా సాగింది. మండలంలోని టీడీపీకి గట్టిపట్టుఉన్న గుడివాడలో వైసీపీ పార్టీ మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు ఆ గ్రామ పోలింగ్ కేంద్రంలో ఉండి పలువురు ఓటర్లతో వైసీపీకి ఓటు వేయాలని చెప్పడంతో టీడీపీ వర్గీయులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఉదయం అదే కేంద్రం వద్ద వైసీపీ నాయకులు గ్రామంలో ఓటర్లను తీసుకుని వారితోపాటు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేక్రమంలో టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణ నెలకొనడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వైసీపీ వర్గీయులు ఓ కానిస్టేబుల్‌పై దాడికి తెగబడ్డారు. మధ్యాహ్నం అన్నాబత్తుని శివకుమార్ కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి ఆ పోలింగ్ కేంద్రానికి చేరుకుని టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేలా దుర్భషలాడి కారుపై నుంచి సవాల్ విసురూతూ కొంతసేపు వైసీపీ శ్రేణులతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. పోలీసులు ఇరువురిని పక్కకు నెట్టడం, వర్షం పడటంతో అక్కడి నుండి వెళ్లిపోయారు. కొలకలూరు గ్రామంలో హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఆ గ్రామ వైసీపీ ఎంపీటీసీ కాళిశెట్టి ఫణికుమార్ వైసీపీకి ఓట్లు వేయించుకునేందుకు శాయసక్తులా ప్రయత్నించాడు. టీడీపీ శ్రేణులు ఆయనను అడ్డుకోబోయినా వెనుకాడలేదు. అదే కేంద్రానికి వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య వచ్చి ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించి వెళ్లారు. తెనాలి రజక చెరువుసమీపంలోని పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఓటరుపై దుర్భషలాడి దాడి చేశాడన్న ఆరోపణలు వినిపించాయి. ఇలా పలు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వారివంతు ప్రయత్నాలు జరిగాయి.

కొల్లిపర మండలంలో 83 శాతం పోలింగ్

కొల్లిపర, మే 13 : తెనాలి నియోజకవర్గ పరిధిలోని కొల్లిపర మండలంలో స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికి పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఎండ తీవ్రతగా ఉండటంతో ఉదయమే ఓట్లు వేసేందుకు ఎక్కువ మంది మహిళలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఈవీఎంలు మొరాయించినప్పటికీ ఓటర్లు ఓర్పుగా తమ ఓటు హక్కును రాత్రి 9 గంటల వరకు వినియోగించుకున్నారు. కొల్లిపరలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పోలింగ్ స్టేషన్లను చేరుకుని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు గుర్తింపు కార్డులేని వారు ఆధార్‌కార్డుతో పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 51 పోలింగ్ కేంద్రాల్లో 45వేల02 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 83 శాతం మంది తమ ఓటును వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

సాయంత్రం 3గంటలకు పెరిగిన పోలింగ్

మొక్కజొన్న, జొన్న పనుల్లో బిజీ, బిజీగా ఉన్న రైతులు, కూలీలు మధ్యాహ్నానికి పనులు ముగించుకుని 3గంటలకు పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. దీంతో కొన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు ఎక్కువగా ఉండటంతో పాటు ఈవీఎంలు కూడా మరోసారీ మొరాయించటంతో ఓటింగ్ మందకొడిగా నడిచింది. రాత్రి 9 గంటల తర్వాత గట్టి బందోబస్తు నడుమ ఈవీఎంలను నాగార్జున యూనివర్సిటీకి తరలించారు.

పొన్నూరు నియోజకవర్గంలో...

పొన్నూరుటౌన్, మే13: పొన్నూరు నియోజకవర్గంలలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం చెదురు మదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా సాగింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంతో ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పలు గ్రామాలో ఈవీఎంలు మొరాయించటంతో ఉదయం 8.30 గంటలకు కూడా పోలింగ్ ప్రారంభం కానీ పరిస్థితులు ఉన్నాయి. పొన్నూరు పట్టణంలోని 182, 183 బూతులోని ఈవీఎంలు మోరాయించాయి. అలాగే చేబ్రోలులోని 139, నిడుబ్రోలు సంజీవనగర్ కాలనీలోని 222, చేబ్రోలు మండలంలోని శలపాడు గ్రామంలో 92వ పోలింగ్ బూతులోని ఈవీఎంలు మోరాయించాయి. పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ ప్రక్రియ ఉదయం 8గంటల తర్వాతే ప్రారంభం అయింది. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగటంతో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. ఎండ వేడిని తాళలేక పలువురు వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారు. పోలింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది.



పోలింగ్ బూత్‌లను సందర్శిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు





కొల్లిపర పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సరళిని పరిశీలిస్తున్న గుంటూరు పార్లమెంట్ కూటమిఅభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్

చెదురుమదురు సంఘటనలు....

పోలింగ్ కేంద్రాల వద్ద చెదురుమదురు సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవటంతో పోలీస్ యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. మండల పరిధిలోని నండూరు గ్రామంలో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్‌పై దాడికి ప్రయత్నించటం గ్రామంలో తీవ్ర ఉధృత్తకు దారి తీసింది. టీడీపీ వైసీపీ శ్రేణులు ఘర్షణలకు దిగగా రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితి చక్కదిద్దారు. అలాగే చింతలపూడిలో వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పోలింగ్ బూత్‌లో తిష్టవేసిన సంఘటన కూడా వివాదానికి కారణమైంది. ఈ సంఘటనలో అంబటి మురళికి గ్రామస్థులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పట్టణంలోని శెట్టికోటయ్య పాఠశాల్లో ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు దాహం తీర్చాలని కోరగా టీడీపీ నాయకులు మంచి నీరు తెచ్చివ్వటాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులలు అభ్యంతరాన్ని లేవనెత్తారు. అయితే ఓటర్లు దాహార్తిని తీర్చుకోనివ్వరా అని ప్రశ్నించటంతో వైసీపీ శ్రేణులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

పోలింగ్ శాతం పొన్నూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పోలింగ్ ఉదయం మందకొడిగా ప్రారంభమైనప్పటికి సాయంత్రానికి భారీ పోలింగ్ దిశగా ముందుకు సాగింది. ఉదయం 9 గంటల వరకు కేవలం 7.7 శాతం మాత్రమే పోలింగ్ నమోదు అయింది. ఆ తర్వాత 11 గంటలకు 22.07 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 37.03 శాతం పోలింగ్ నమోదైంది, మధ్యాహ్నం 3 గంటలకు 52.11 శాతం, 5 గంటలకు 67.66 శాతం, 6 గంటలకు 70.93 శాతం పోల్ పర్సంటేజ్ నమోదైంది. రాత్రి 7 గంటలకు 73.84 శాతం, 8 గంటలకు 76.30 శాతం పోలింగ్ పర్సంటేజ్ నమోదైంది.



పొన్నూరు పంచాయతీ రాజ్ కార్యాలయ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవటానికి బారులు తీరిన ఓటర్లు

అయితే పొన్నూరు పట్టణంలోని పలు వార్డులతో పాటు చింతలపూడి, బ్రాహ్మణకోడూరు, పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూల్, ఎంపీడీవో కార్యాలయ పోలింగ్ బూత్‌తో పాటు చేబ్రోలు మండలంలోని శలపాడు, తదితర గ్రామాలో పోలింగ్ కొనసాగుతుండంతో 80 శాతం పైగా రికార్డులో స్థాయిలో పోలింగ్ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు తరలించేందుకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సెయింట్ ఆన్స్ పాఠశాల నుంచి ఈవీఎంలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేలా ఏర్పాట్లు జరిగాయి.

క్షేత్రస్థాయిలో పర్యటించిన నరేంద్ర కుమార్

పెదకాకాని, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు సోమవారం సాయంత్రం పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పెదకాకాని, నంబూరు ప్రాంతాల్లో పర్యటించి పోలింగ్ బూత్లలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. పెదకాకానిలోని అనేక బూత్‌లను పరిశీలించిన అనంతరం నంబూరు వెళ్లారు. నంబూరు గ్రామంలో పలు బూత్‌లను సందర్శించి ఓటర్లకు అభివాదం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యసేవల తనిఖీ

తెనాలి రూరల్, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్ సోమవారం పరిశీలించారు. అనారోగ్య సమస్యలతో వచ్చె ఓటర్లకు పోలింగ్ కేంద్ర సమీపంలో ఏవైన ఆరోగ్యసమస్యలు తలెత్తితే తక్షణవైద్యం అందించేందుకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అనారోగ్య సమస్యలతో పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చేవారికి తక్షణవైద్యం అందించాలని ఆదేశించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఓట్ల సునామీలో

వైసీపీ కొట్టుకుపోవటం ఖాయం : ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మే 13: ఇనాళ్ల భయంతో మౌనంగా ఉన్న ప్రజలు తమ ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. ప్రజల ఓట్ల సునామితో వైసీపీ ప్రభుత్వం కొట్టుకుపోవటం ఖాయం అని కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని చింతలపూడిలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కుటుంబం సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ పోలింగ్ ఏర్పాట్ల విషయంలో ఎన్నికల సంఘం చెప్పిన దానికి వాస్తవానికి పొంతనలేదన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో ఈసీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సరైన సౌకర్యాలు లేక ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచివుండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి ఇదే చివరి ఎన్నికలుగా చెప్పారు. వైసిపీ ప్రభుత్వం విధ్వంసాలు, అరాచకాలు, దోపిడీల వలన నష్టపోయిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వైసీపీ ప్రభుత్వాని ఓటు అనే ఆయుధం ద్వారా ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించటం ఖాయం అయిందని నరేంద్ర కుమార్ తెలిపారు.



ఓటు హక్కు వినియోగించుకున్న నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులు

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

తెనాలి మారీసుపేట, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పలువురు రాజకీయ ప్రముఖులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ పట్టణంలోని కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని బుర్రిపాలెంలో కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన ఓటు హక్కును వినియోగించారు. తెనాలి ఐతానగర్‌లోని ఎర్రబడిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. తెనాలి ఎన్ఎస్ఎస్ఎమ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినపోలింగ్ బూత్‌లో మాజీ మహిళా ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి ఆమె భర్త ముకుందరావు దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనకు అంతం పలికారు

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మే 13: వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనకు అంతం పలికే రోజు రానేవచ్చిందని ప్రజలందరూ ఉత్సాహంగా తమ ఓటును వినియోగించుకున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మనోహర్ పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు అందిస్తున్న సదుపాయాలు, ఈవీఎంల పనితీరు, విద్యుత్ వంటి అంశాలను పరిశీలించిన అనంతరం నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల నుండి వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అహంకారంతో పాలన సాగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసి శాసనసభ్యులు ఆయన సహచరులు దౌర్జన్యాలు, దాడులు వంటి మూర్ఖపు ఆలోచనలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఓటింగ్‌కు వచ్చే ఓటర్లపై ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాల్సిందిపోయి సహనం కోల్పోయి తలదించుకునేలా దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. సామాన్య ఓటరుని కొట్టి ఆ ఘటన నుంచి తప్పించుకునేందుకు కులాలు, మతాలు రెచ్చగొట్టడం బాధాకరమని ఇటువంటి సంస్కృతి తెనాలికి మంచిది కాదన్నారు.

మా భవిష్యత్తుకోసం తొలిఓటు వేశాం

తెనాలి రూరల్, మే 13: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పొంది తమ తొలి ఓటు రాష్ట్రకోసం.. యువత భవిష్యత్తుకోసం.. ప్రజల సంక్షేమం కోసం.. అమరావతి రాజధాని పునఃనిర్మాణం కోసం వేశామని యువ ఓటర్లు చెప్పారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలిగా ఓటుపొందిన యువత పెద్దసంఖ్యలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువత మాట్లాడుతూ తాము తొలిగా ఓటు పొంది దానిని రాష్ట్రం కోసం వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో తాము వేసిన ఓటు రాష్ట్ర ప్రగతికి, రైతుల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొల్పడానికి, కార్మిక, కర్షక రంగం కార్మికుల సంక్షేమానికి, నిరుద్యోగుల ఉద్యోగ ఉపాధి కల్పనకు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మంచి జరిగేందుకు, కుల వృత్తుల వారి అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి వెరసి రాష్ట్రం కోసం వేశామని చెప్పారు. ఓటు ద్వారా పార్టీలకు అతీతంగా రాష్ట్రం కోసం, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే వారిని ఎన్నుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటు నోటుకు అమ్ముడుపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని తద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పదన్నారు. ఓటు విలువ తెలుసుకుని సరైన నాయకత్వాన్ని బలపరిచామని యువ ఓటర్లు వీరవల్లి పూజిత్‌చౌదరి, వీరవల్లి కుసిల్, కర్నాటి అభినయ్, కనగాల యువరాజ్, మన్నె గణేష్ చౌదరి, పేరం నవీన్, పరుచూరి కుందన్, బోయా ప్రదీప్, తాడిబోయిన విశ్వనాద్, పాగోలు హనుమంత్ సాయి, వీరవల్లి చేతన్‌లు చెప్పారు.

కవ్వింపులు... కొట్లాటలతో పోలింగ్ గందరగోళం

- తెనాలి నియోజకవర్గంలో అధికార పార్టీ హడావుడి
- ఐనా లెక్క చెయ్యని ఓటర్లు... పట్టుబట్టి ఓటువేసిన వైనం

తెనాలి, మే 13, (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా కవ్వింపులు... కొట్లాటకు కాలుదువ్వటం, కారెక్కి తొడలు కొట్టటం... అంతా ప్రతిపక్ష పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి గొడవలకు దిగటం వంటి భయానక పరిస్థితులు సృష్టించే ప్రయత్నంలో ఓటర్లు మాత్రం ఎక్కడా చెక్కుచెదరని విశ్వాసంతో, భయపడిపోయి వెళ్లిపోకుండా అర్ధరాత్రి వరకు ఓటు హక్కు వినియోగించుకోవటం విశేషం. తెనాలి నియోజకవర్గంలో పోలింగ్ మొదలయిన రెండు గంటల్లోనే వైసీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఓటర్‌పై చేయిచేసుకున్న సఘటన సంచలనం కలిగిస్తే, ఆ తర్వాతకూడా అధికార పార్టీ శ్రేణుల దాడులు ఆగలేదు. రూరల్ మండలం కోపల్లె గుడివాడ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల దగ్గర మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, మరికొందరు లోపలే ఉండి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నంలో, టీడీపీ, జనసేన నాయకులు అభ్యంతరం పెట్టటం, పోలీసులు వారిని బయటకు పంపే ప్రయత్నంలో ఏకంగా కానిస్టేబుల్‌పైనే చేయిచేసుకోబోయిన విషయంపైనా వార్త గుప్పుమంది. తర్వాతకూడా పోలింగ్ బూత్ బయట హల్‌చల్ చేయటం, కారెక్కి తొడకొడుతూ రేపు గెలిచాక చెబుతామంటూ బెదిరింపులకు, కవ్వింపులకు పాల్పడటం కనిపించింది. అయితే పోలీసులు ఒక్కో బూత్‌లో ఇద్దరేసి చొప్పున మాత్రమే ఉండటంతో వారిని వారించలేని పరిస్థితి. చివరకు శృతిమించటంతో పోలీసులను పిలిపించి వారిని పంపేశారు. తెనాలి పట్టణంలోనూ రజక చెరువు దగ్గర మూడు దఫాలుగా చిన్నపాటి ఘర్షణలు జరిగాయి. ఎంపీపీ చెన్నకేశవులుకు, ప్రతిపక్ష పార్టీల వారికి మధ్య వాదనలు జరిగాయి. తర్వాత రెండు దఫాలుగా మరికొందరు నాయకులకు మధ్య ఘర్షణ జరిగింది. అయితే కొట్లాటల వంటి పరిస్థితి రాకుండానే పోలీసులు గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోగలిగారు. లవకుశలు ఆసుపత్రి రోడ్‌లోనూ పలు దఫాలుగా కవ్వింపు చర్యలకు దిగారు. ఉదయమంతా ప్రశాంతంగా సాగితే, మధ్యాహ్నం నుంచి చిన్నపాటి ఘర్షణలు తలెత్తాయి. అధికార పార్టీవారు పోలింగ్ కేంద్రంలో ఓట్లు అడగటం, దానికి ప్రతిపక్ష నాయకులు అభ్యంతరం పెట్టటం వంటి పరిస్థితుల్లో అధికార పార్టీ వర్గం నుంచి ఒక యువకుడు ఇటుక రాయి తీసుకుని కొట్టేందుకు దూసుకురావటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన పోలీసులు అతనిని చాకచక్యంగ పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతనిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేసినా, చివరకు పోలీసులపై వత్తిడి తెచ్చి మరీ అతనిని విడిపించుకుపోయారు. అటు పాలాద్రి కాల్వ దగ్గర పాఠశాలలోనూ అధికార పార్టీ నాయకులు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే గెలిచాక మూడు నెలలపాటు కేబుల్ ఛానల్ ఫ్రీగా ఇస్తామంటూ పెద్దగా అరిచి చెప్పటంతో జనసేన నాయకులు అతనిని అడ్డుకున్నారు. బయటకు పంపేవరకు పట్టుబట్టటంతో పోలీసులు జోక్యంచేసుకుని శాంతపరిచారు. అటు చెంచుపేటలోని కేవీఎంఎం స్కూల్ లోనూ గత ఎన్నికల సమయంలో గొడవలు చేసిన వ్యక్తే మళ్లీ ఈసారి కూడా లోపలకు వచ్చి గొడవ చేసేందుకు ప్రయత్నం చేయటం, రాత్రి సమయం కావటంత మహిళా ఓటర్లపై బెదిరింపులకు దిగటం వంటి వేధింపులు పెరగటంతో మహిళలు మొత్తం ఎదురుతిరగటం, పోలీసులు అతనిని స్టేషన్‌కు తరలించారు. అటు కొల్లిపర మండలంలోని జెముడుబాడులోనూ వృద్ధులు ఓటు వేసేందుకు ఫ్యాన్ గుర్తు అడిగితే సిబ్బంది గ్లాస్ గుర్తునకు వేయించారని వైసీపీ, గ్లాస్‌కు వేయమని అడిగితే ఫ్యాన్‌కు వేయిస్తున్నారని జనసేన నాయకులు ఘర్షణకుదిగారు. ఇది చాలాసేపు కొనసాగింది. చివరకు సరుదమణిగింది. ఇవికాక నియోజకవర్గంలో చాలాచోట్ల చెదురుమదురు సంఘటనలు జరిగాయి. చిన్నపాటి ఘర్షణలను నాయకులు, పోలీసులు సర్దిచెప్పి పంపటంతో చివరు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగినట్టయింది.

చింతలపూడిలో పోలింగ్ బూత్‌లో తిష్టవేసిన అంబటి

పొన్నూరుటౌన్, మే13: వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో 249వ పోలింగ్ బూత్‌లో తిష్టవేసిన చర్య గ్రామంలో అలజడులకు కారణమైంది. మండల పరిధిలోని చింతలపూడి కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్వగ్రామం. నరేంద్ర కుమార్ గృహానికి కూతవేటు దూరంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 249వ పోలింగ్ బూత్ ఉంది. సోమవారం సాయంత్ర అంబటి మురళీకృష్ణ పెద్దఎత్తున అనుచరులతో పోలింగ్ బూత్ వద్దకు రావటమే కాకుండా అనుచరులతో కలిసి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారు. ఓటుకోసం వేచివున్న గ్రామస్థులు అభ్యర్థితో పాటు ఎంతమందిని లోనికి అనుమతిస్తారని పోలింగ్ అధికారులను నిలదీసారు. అయితే అంబటి మురళీకృష్ణ వెంట వచ్చిన అనుచరులను ఓటర్లపైకి ఉసిగొల్పేలా ప్రయత్నించారని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అసలు ఎన్నికలకు సంబంధం లేని వ్యక్తులు చీఫ్ ఎలెక్షన్ ఏజెంట్లుగా అంబటితో పోలింగ్ బూత్‌లోకి రావటం ఆక్షేపించారు. పోలింగ్ అధికారులు అంబటి అనుచరులను బయటకు పంపించిన తర్వాత అక్కడ ఉన్న ఓటర్లను రెచ్చగొట్టేలా అంబటి మురళీకృష్ణ పోలింగ్ బూత్‌లో కుర్చీ వేసుకొని కూర్చొని నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. కోపోద్రిక్తులైన ఓటర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సతీమణి జోతిర్మయి, కుమార్తె నాగ సాయి వైదీప్తి పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి పోలింగ్ అధికారులను, పోలీసులను నిలదీశారు. పోలింగ్ కేంద్రాలకు నిబంధనలకు విరుద్ధంగా మైనార్టీ కమిషన్‌కు చెందిన వాహనంలో రావటమే కాకుండా పోలింగ్ కేంద్రంలతో నిబంధనలకు విరుద్ధంగా కూర్చోవటాన్ని వైదీప్తి ప్రశ్నించటంతో పోలింగ్ అధికారులు అంబటి మురళీకి సర్దిచెప్పి అక్కడికి పంపించివేశారు. చింతలపూడి గ్రామంలో అల్లజడులు సృష్టించటానికే అంబటి మురళి ఈ విధమైన చర్యలకు పూనుకున్నారని గ్రామస్థుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. అంబటి చర్యలపై, పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించిన వైసీపీ నాయకులపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.